క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ- సూపర్‌సేవింగ్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న 5,12,18,24 శాతం ఉన్న జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించిందని తెలిపారు. గత నెల 22వ తేదీ నుంచి తగ్గిన జీఎస్టీ స్లాబ్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీని వల్ల వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికాలు, ఔషధాలు, పాల పదార్థాల ధరలు, నోట్ పుస్తకాలు, పేపర్స్, ప్రింటర్స్, ల్యాప్‌టాప్, తదితర వస్తువల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేంద్రారెడ్డి, కృష్ణదాసు, భాస్కర్‌నాయక్, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సవరించిన జీఎస్టీతో ఆర్థిక ప్రయోజనం

డోన్ టౌన్: కేంద్రం తీసుకొచ్చిన నూతన జీఎస్టీతో ప్రజలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ వీరాచారి, వాణిజ్యశాస్త్ర విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకట కృష్ణయ్య అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్త జీఎస్టీతో పలు వస్తువుల ధరలు తగ్గాయని తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా 7వ తేదీ స్థానిక కళాశాలలో వక్తృత్వ పోటీలు, 8న ర్యాలీ, వ్యాసరచన పోటీలు, 9న ఔట్రీచ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ



ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ

బనగానపల్లె రూరల్: స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులను జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మతేష్‌ను మండల అధ్యక్షుడిగా, చందును కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా మనోజ్, విశ్వతేజ, కిరణ్, రాజేష్‌లను ఎన్నుకున్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల: రాష్ట్ర స్థాయి రన్నింగ్ రేస్‌లో ప్రతిభ చూపిన మోడల్ స్కూల్ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి సోమవారం తెలిపారు. గత నెల 25,26 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన 600 మీటర్ల రన్నింగ్ రేస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని లక్ష్మీకాంతి పాల్గొంది. ఈ పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. త్వరలో ఒడిస్సాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

పూజల విషయంలో ఘర్షణ

● ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి: తన ఇంటి ముందు ఉన్న పురాతన ఆలయంలోనే ముందు పూజలు, కొబ్బరికాయ కొట్టాలన్న విషయంలో జరిగిన ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండలంలోని జి.వీరాపురం గ్రామ ప్రజలు ఏటా వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని నల్లమల అటవీప్రాంతంలోని వరదరాజస్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగానే వరదరాజస్వామి వద్దకు వెళ్లే సమయంలో గ్రామంలోని ఆలయాల్లో ముందుగా పూజలు చేసి, టెంకాయ కొట్టడం ఆనవాయితీ. గ్రామ పెద్ద బోరెడ్డి రమణారెడ్డి మహిళలతో, మేళ తాళాలతో రామాలయంలో పూజ చేసి కాయ కొట్టే సమయంలో పక్కనే ఉన్న కమ్మరి శ్రీనివాస ఆచారి తన ఇంటివద్ద ఉన్న బ్రహ్మం గారి ఆలయం పురాతనమైనదని అక్కడే మొదట పూజలు చేయాలని ఘర్షణ పడ్డాడు. ఘర్షణలో శ్రీనివాస ఆచారి, రమణారెడ్డిపై బడిసె(చెక్కపని చేసే పరికరం)తో తలపై బలంగా కొట్టడంతో లోతైన గాయమై అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో అక్కడున్న కొంతమంది గ్రామస్తులు శ్రీనివాస ఆచారికి దేహశుద్ధి చేయడంతో కుడి కన్నుపై రక్త గాయం, మెడ వద్ద, వీపుపై, నడుముపై కందిన గాయాలు అయ్యాయయి. గ్రామస్తులు 108కి ఫోన్ చేయగా సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన వారిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రమణారెడ్డిని కర్నూలుకి తరలించారు. ఈ విషయమై ఏఎస్ఐ రామ్‌నాయక్ మాట్లాడుతూ రమణారెడ్డి భార్య చిన్నక్క ఫిర్యాదు చేసిందని, విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

అన్నదాత ఆక్రందన

● కొర్ర, సజ్జ పంటలకు మద్దతు ధర కరువు
● భరోసా కల్పించని ప్రభుత్వం



బేతంచెర్లలో సాగైన కొర్రపంట

బేతంచెర్ల: ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో ఖరీఫ్ పంటలు మంచి దిగుబడి ఇచ్చినా, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం సంప్రదాయ పంటల సాగును ప్రోత్సహిస్తూ సదస్సులు నిర్వహించినా, పంటలు పండిన తర్వాత సరైన ధర కల్పించడంలో విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. డోన్ నియోజకవర్గంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 60,245 హెక్టార్లు కాగా, ప్రస్తుతం 52,950 హెక్టార్లలో సాగు జరిగినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వర్షాధారంగా సాగు చేసిన కొర్ర, సజ్జ పంటలు ఈ సీజన్‌లో కోత దశకు వచ్చాయి. నూర్పిడి పనులు ఊపందుకున్నాయి. సకాలంలో వర్షాలు రావడంతో రైతులు ఎకరాకు 6-7 క్వింటాళ్ల దిగుబడి పొందుతున్నారు. అయితే మార్కెట్లో సరైన ధర లభించక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంప్రదాయ పంటలకు పెట్టుబడి తక్కువగా ఉంటుందని చెప్పే ప్రభుత్వం, గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో పూర్తిగా విఫలమవుతోందని.. తమ కష్టానికి ఫలితం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ఏటా సకాలంలో వర్షాలు కురవక నష్టపోతున్నామని.. అయితే ఈ ఏడాది వర్షాలు కురిసి పంటలు బాగా పండినా ప్రభుత్వ చేతగానితనం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డోన్ నియోజకవర్గంలో సాగు వివరాలు (హెక్టార్లు)

మండలం	కొర్రపంట	సజ్జ పంట
డోన్	524	1311
ప్యాపిలి	20	3153
బేతంచెర్ల	440	280

ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఇలా..

కొర్రలు	-రూ.2000-2200
సజ్జలు	-రూ.1700

నష్టపోతున్నాం



రెండేళ్లుగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో ఎంతో సంతోషపడ్డాం. అయితే ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. పంటల దిగుబడి బాగున్నా ధరలు లేక నష్టపోతున్నాం. గత ప్రభుత్వంలో సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా అయ్యేది. పంటలకు గిట్టుబాటు ధర కూడా లభించింది. ఇప్పుడు అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు.

–చంద్రశేఖర్ రెడ్డి, రైతు, అంబాపురం

గిట్టుబాటు ధరలేదు



నేను ఈ ఏడాది 2 ఎకరాల్లో కొర్ర, ఒక ఎకరాలో సజ్జ పంట సాగు చేశాను. దిగుబడులు ఆశాజనకంగా వచ్చినా కొర్రలు మార్కెట్లో రూ. 2,000–2,200 మాత్రమే పలుకుతున్నాయి. సజ్జలు రూ.1700 మించి అడగడం లేదు. కొర్రకు క్వింటా రూ.3 వేలు, సజ్జ రూ. 2500 చెల్లిస్తే రైతన్నకు పెట్టుబడులు దక్కడమే కాకుండా సంప్రదాయ పంటల సాగును ప్రోత్సహించిన వారవుతారు. లేకపోతే అప్పులు మిగిలే అవకాశం ఉంది.

–వెంకట శివుడు, హుసేనాపురం

రైతన్నలను ఆదుకోవాలి



మార్కెట్‌లో విత్తనాలు మొదలుకుని, ఎరువుల వరకు వారు నిర్ణయించిన ధరలకే రైతులు కొనుగోలు చేయాలి. ఎండకు ఎండి.. వానకు తడిసి ఎంతో కష్టపడి రైతన్నలు పంటలు పండిస్తే దళారుల భోజ్యంగా మారి గిట్టుబాటు ధర లభించడం లే దు. ఇప్పటికైనా సంప్రదాయ పంటలైన సజ్జ, కొ ర్ర, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

–రామ్మోహన్, రైతు సంఘం నాయకుడు

టీకాతో రక్ష

● గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు
● ఈ నెల 15 వరకు అవకాశం



టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ కొండారెడ్డి (ఫైల్)

సంజామల: వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం అధికంగా ఉంటుంది. వీటిని రక్షించుకోవాలంటే ముందస్తు టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా గాలికుంటు వ్యాధి ఎక్కువగా వస్తుంది. వీటి నివారణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పశువులకు ఉచితంగా టీకాల కార్యక్రమం చేపడుతోంది. ఈ నెల 15వ తేదీ వరకు ఉచితంగా టీకాలు వేయనున్నారు. టీకా వేసిన పశువుల్లో 3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా వ్యాధులు సోకకుండా రక్షణ లభిస్తుంది. బనగానపల్లెలో మొత్తం 82,678 పశువులు ఉన్నాయి. వీటిలో గేదెలు-72,202, ఆవులు- 10,476 ఉన్నాయి.

వేగంగా వ్యాప్తి

వాతావరణ మార్పులతో కలుషితమైన గాలి ద్వారా గాలికుంటు వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా1, సాట్1, సాట్2, సాట్3 వంటి రకాలు ఉన్నాయి. దేశవాళి పశువుల కంటే సంకరజాతి పశువుల్లో ఎక్కువ నష్టం కలిగిస్తాయి. ఒక పశువుకు వైరస్ సోకితే వేగంగా ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుంది. తల్లి పాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

వ్యాధి లక్షణాలు

పశువుల్లో గాలికుంటు వ్యాధిని సులభంగా గుర్తించవచ్చని పశువైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం ఉంటుంది. 102 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. నోటిలో బొబ్బలు పగిలి చొంగ కారుతుంది. వ్యాధి సోకిన పశువులు మేత సరిగా తీసుకోలేవు. దీంతో పశువులు నీరసించి నడవలేని స్థితికి చేరుకుంటాయి. రొమ్ముపై బొబ్బలు ఏర్పడుతాయి. గేదెలు, ఆవులు గర్భధారణ కోల్పోతాయి. నివారణ కోసం ముందస్తు టీకాలు వేయిస్తే ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.వ్యాధి సోకితే డాక్టర్ల సలహా మేరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.

కుందూలో మృతదేహం గుర్తింపు

నంద్యాల(అర్బన్): కుందూనదిలో ఓ పురుష మృతదేహం కొట్టుకొనివచ్చి మండలంలోని భీమవరం గ్రామ సమీపంలోని వంతెన వద్ద నిలిపోవడాన్ని నంద్యాల రూరల్ పోలీసులు గుర్తించారు. సోమవారం మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు మాట్లాడుతూ.. సాయిబాబా మెటల్ డాలర్, కాషాయపుగధ మృతుడి మెడలోఉన్నాయని, కుడి చేతికి అమ్మ అనే పచ్చ బొట్టువేసి ఉందన్నారు. నెల రోజుల నుంచి ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి తప్పి పోయి ఉంటే నంద్యాల తాలూకా సీఐ సెల్ 91211 01092,99858 65553 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



పేకాట రాయుళ్ల అరెస్టు చూపుతున్న ఎస్ఐ

రుద్రవరం: మండల పరిధిలోని నక్కలదిన్నెలో సోమవారం 9మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫి తెలిపారు. గ్రామంలో కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచామన్నారు. పేకాట ఆడుతుండగా 9 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన కార్లు

శిరివెళ్ల: నంద్యాల- ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై యర్రగుంట్ల పెట్రోల్ బంక్ వద్ద సోమవారం మూడు కార్లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన వారు కారులో అరుణాచలం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఘటనా స్థలం వద్దకు చేరుకోగానే కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌ను దాటి నంద్యాల నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న మరో కారును ఢీకొంది. అదే సమయంలో నంద్యాల నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న ఇంకో కారు వేగంగా వచ్చి ముందు కారును ఢీకొంది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన భీమలింగం, అతని భార్య చంద్రకళ, ప్రొద్దుటూరు యాక్సిస్ బ్యాంక్ ఉద్యోగి శివశంకర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ చిన్న పీరయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బ్యాంక్ ఉద్యోగి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను విస్మరించడం సరికాదు



చలో విజయవాడ కరప్రతాలను పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు అబ్దుల్ లతీఫ్, సర్వజ్ఞమూర్తి డిమాండ్ చేశారు. హుసేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఇప్పటివరకు ఉపాధ్యాయుల సమస్య ఒక్కటి కూడా పరిష్కారం కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ నియమించకపోవడం బాధాకరమన్నారు. కొత్త కార్యక్రమాలు అమలు చేస్తూ వాటి వివరాలు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించడంతో బోధన కుంటుపడుతోందని తెలిపారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టనున్న ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. హుసేనాపురం పాఠశాల హెచ్‌ఎం అన్వర్‌బాషా, గోపాల్, చార్లెస్, కంబగిరి రాముడు, దివాకర్, జయలక్ష్మి, రుక్సానాఖాతున్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ధర్నాను విజయవంతం చేద్దాం

అవుకు(కొలిమిగుండ్ల): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన డిమాండ్ల పరిష్కారం కోసం మంగళవారం తలపెట్టిన ఫ్యాప్టో రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేద్దామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి పిలుపునిచ్చారు. సోమవారం గుండ్లశింగవరం ఉన్నత పాఠశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఉద్యోగులకు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పీఆర్సీ, అరియర్స్ ఇంత వరకు జమ కాలేదన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం తదితర డిమాండ్ల సాధన కోసం చేపట్టనున్న ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ రసూల్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగమయ్య, రాష్ట్ర కౌన్సిలర్ గోవిందునాయక్, మహ్మద్ షఫీ, తిమ్మయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీలత పాల్గొన్నారు.

భ్రామరీకి లక్ష కుంకుమార్చన



కుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను జరిపించారు. శ్రీశైలానికి స్వయంగా రాలేని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలకు చెందిన 19 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా సేవను నిర్వహించుకున్నారు. ముందుగా అర్చకులు పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను జరిపి లక్షకుంకుమార్చన సేవను జరిపించారు.

పల్లకీలో విహరించిన ఆది దంపతులు



పల్లకీసేవలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, అర్చకులు ముందుగా స్థానిక అలంకార మండపంలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహా మంగళహారతులు, బలిహరణ అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం జరిపారు.

ఎస్సార్బీ‘ఛీ’..!



ఎస్సార్బీసీలో పేరుకుపోయిన పాచి, చెత్తాచెదారం

కోవెలకుంట్ల పట్టణ శివారులోని గుంజపాడు రహదారిలో ఉన్న ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వ నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. కాల్వలో చెత్తాచెదారం, పాచి పేరుకుపోయి కల్వర్టు వద్ద అడ్డుపడింది. కాల్వ నిండా వ్యర్థాలు చేరడంతో నీటి విడుదలకు అడ్డంకిగా మారింది. ఎస్సార్బీసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని పాచి, చెత్తాచెదారం తొలగించి నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయాలని రైతులు కోరుతున్నారు.

–కోవెలకుంట్ల



గుంజలపాడు రహదారిలో కల్వర్టు వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన వ్యర్థాలు

●అరకొర బస్సులతో అవస్థలు



బనగానపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

బనగానపల్లె: అరకొర ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం వల్ల మహిళలకు ఉచిత ప్రయాణం లభించడంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బనగానపల్లె బస్టాండ్‌లో రెండు రోజులుగా మహిళల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ప్రధాన ంగా కర్నూలు-నంద్యాల, తాడిపత్రి-గుత్తి మార్గా ల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. పండుగల సెలవు లు ముగియడంతో బస్సులకు డిమాండ్ పెరిగినా, సరిపడా బస్సులు లేక గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డిపో మేనేజర్ రవికిశోర్ మాట్లాడుతూ.. మహిళల ఉచిత ప్రయాణం ప్రారంభమైన తర్వాత ప్రతి రూట్‌లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, అదనంగా పాఠశాల బస్సులను కూడా రూట్లలో నడుపుతున్నట్లు తెలిపారు.

అనుమతి నిరాకరించడం దారుణం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

కొలిమిగుండ్ల: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడం దారుణమని వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ అన్నారు. గత ఐదేళ్ల నుంచి స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఖాళీ ప్రాంతంలో జరుపుకునేవాళ్లమన్నారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి వేడుకలు జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా నిరాకరించారని పేర్కొన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా జయంతి వేడుకలు జరుపుకుని అన్నదానం చేస్తామని విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. తహసీల్దార్ అనుమతి నిరాకరించడంతో కమిటీ సభ్యులు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వాల్మీకి సంఘం నాయకులు పెద్దయ్య, కంబగిరిస్వామి, రామ్మూర్తి, వెంకటరమణ, నరసింహులు, కంబగిరి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డోన్ టౌన్: భారత రాజ్యాంగంలోని లౌకిక, సామ్యవాద పదాలను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం అక్టోబర్ 9న విజయవాడ ధర్నాచౌక్‌లో చేపడుతున్న నిరసన కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబశివుడు, జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబయ్య, మండల అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

దేశ సంక్షేమమే లక్ష్యం



అతిథిగా మాట్లాడుతున్న బుగ్గన రమణారెడ్డి



హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

బేతంచెర్ల: భారతదేశ పౌరులుగా సమాజ అభివృద్ధితో పాటు, హిందూ ధర్మం, దేశ భద్రతకు పాటు పడాలని ఆర్ఎస్ఎస్ కర్నూలు విభాగ్ ప్రముఖ్ సురేంద్రబాబు, జిల్లా సెక్రటరీ రఘురామ్, ముఖ్య అతిథి బుగ్గన రమణారెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, హిందూ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దేశ సంక్షేమమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, ప్లాస్టిక్ కవర్లకు స్వస్తి పలడం, ఆపదలో ఉన్నవారికి సాయం చేసి దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయానికి ప్యాపిలి గ్రామానికి చెందిన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ. 10,000 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి సోమవారం తెలిపారు. విరాళాన్ని యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీశ్వర రెడ్డి, ఆలయ అర్చకుల సమక్షంలో అందజేసినట్లు చెప్పారు. దాతకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.